



## సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 588.20 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



## పులిచింతల ప్రాజెక్టు నీటి నిల్వ
అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,802 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 16,000 క్యూసెక్కులు వదులుతున్నారు.



## సాగునీటి సమాచారం
తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 8004 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 1791 క్యూసెక్కులు వదిలారు.

## న్యూస్‌రీల్

### గాయత్రీదేవిగా బాలచాముండేశ్వరి



**అమరావతి:** ప్రముఖ శైవక్షేత్రం అమరావతిలోని బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా శనివారం బాలచాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో మూడో రోజు సహస్ర కుంకుమార్చన, దేవీ ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చనతోపాటుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### రేపు తెనాలిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**గుంటూరు వెస్ట్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం తెనాలి కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. గుంటూరు కలెక్టరేట్‌లో స్పందన సోమవారం నిర్వహించడం లేదని, అర్జీదారులు తెనాలిలోనే హాజరు కావాలని అధికారులు పేర్కొన్నారు. ప్రతి నెలలో రెండు వారాలకొకసారి ఈ వేదికను జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఇందులో భాగంగానే తెనాలిలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

### రేపు ఉచిత వినికిడి పరికరాలు పంపిణీ

**గుంటూరు మెడికల్ :** గుంటూరు జీజీహెచ్‌లోని డైక్ సెంటర్‌లో 7న వినికిడి పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైన వారికి ఉచితంగా వినికిడి పరికరాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. హాజరయ్యేవారు ఆధార్, రేషన్ కార్డు, , సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌లు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఈఎన్‌టీ వైద్యులు పరీక్షలు చేసిన రిపోర్టులను తేవాలన్నారు.

### మద్యం షాపులకు 230 దరఖాస్తులు

**నెహ్రూ నగర్ :** గుంటూరు జిల్లాలో 127 మద్యం దుకాణాలను ప్రభుత్వం నోటిఫై చేసి దరఖాస్తులు ఆహ్వానించింది. వీటికి సంబంధించి ఆన్‌లైన్‌లో 1వ తేదీ నుంచి 5వ తేదీ రాత్రి 7:30 గంటల వరకు 89 షాపులకు 230 దరఖాస్తులు అందాయి. మిగిలిన 38 షాపులకు ఎటువంటి దరఖాస్తులు రాలేదు.

### నవంబరు 25న మహారుద్రాభిషేకం



**గుంటూరు మెడికల్:** ఆంధ్రప్రదేశ్ హైందవ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహారుద్రాభిషేకం- 2024 పోస్టర్‌లను బీజేపీ నేతలు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జూపూడి రంగరాజు మాట్లాడుతూ.. శివకేశవులకు ఇష్టమైన కార్తిక మాసంలో సొసైటీ ఆధ్వర్యంలో కొన్ని సంవత్సరాలుగా మహారుద్రాభిషేకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమానికి అఘోర్ అఖడా ఉత్తరాధికారి శ్రీ రాజేష్ నాథ్‌జీ ఉజ్జయిని రానున్నట్లు తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఓపెన్ ఆడిటోరియంలో నవంబర్ 25వ తేదీన సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఎంట్రీ పాసులు ఉచితంగా ఇస్తామని తెలిపారు. వివరాలకు ఫోను నెంబరు 99491 48006లో సంప్రదించాలన్నారు. మహా రుద్రాభిషేక నిర్వాహకురాలు గాయత్రి బెహరా, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు గోపికృష్ణ, జనసేన నాయకులు అడపా మాణిక్యాలరావు, కళ్యాణ్, సొసైటీ అధ్యక్షుడు అనిల్ బెహరా, సాయి, శశాంక్ శర్మ, ఉపేంద్ర మేళం స్వరూపరాజు, సాదు రామకృష్ణ, శివశక్తి రాష్ట్ర నాయకురాలు లక్ష్మి, రామానుజ దాసి, గుడిబడి నాయకులు రామరాజు త్రికోటేశ్వర రావు పాల్గొన్నారు.

# అన్నపూర్ణే సదాపూర్ణే..



కనుల పండువగా సాగుతున్న ఆది దంపతుల నగరోత్సవం(ఇన్‌సెట్) అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన కనకదుర్గమ్మ

- వైభవంగా శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ఇంద్రకీలాద్రికి తరలివస్తున్న అశేష భక్తజనం
- దుర్గమ్మకు బంగారు, వెండి కానుకల సమర్పణ
- వీఐపీలకు నిర్ణీత సమయంలోనే దర్శనం: కలెక్టర్, సీపీ

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** దారులన్నీ ఇంద్రకీలాద్రికే సాగుతున్నాయి.. దుర్గగుడి పరిసరాలన్నీ భక్తుల శరణ ఘోషతో మారుమోగుతున్నాయి. అమ్మను భక్తులు కనులారా దర్శించుకుని తరిస్తున్నారు. శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడో రోజైన శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు విశేష అలంకరణ, పూజల అనంతరం ఆలయ ఈఓ కె.ఎస్.రామరావు, పోలీసు అధికారులు అమ్మవారిని తొలి దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజామునే పెద్ద ఎత్తున క్యూలైన్లలో వేచివున్న భక్తులు ప్రశాంత వాతావరణంలో అమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించి, మహా మండపం దిగువన అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం లడ్డూ ప్రసాదాలు కొనుగోలు చేశారు.

**దుర్గమ్మకు కానుకలు**

పలువురు భక్తులు దుర్గమ్మకు బంగారు వెండి వస్తువులను కానుకలుగా సమర్పించారు. గుంటూరు జిల్లాకు చెందిన చేబ్రోలు వుల్లయ్య సుమారు ఐదు కిలోల వెండితో తయారు చేయించిన నెమలిని సమర్పించారు. ప్రకాశం జిల్లా కొండేపి పట్టణానికి చెందిన అంకు రయ్య రూ.18 లక్షల విలువైన బంగారు మంగళసూత్రాలు, నానుతాడును ఆలయ ఈఓ రామరావు, సీపీ రాజశేఖర్‌బాబుకు అందజేశారు.

**వీఐపీ పాసులకు నిర్దేశ సమయమే..**

దసరా ఉత్సవాల్లో అమ్మవారి దర్శనం కోసం నిర్దేశ సమయంలోనే వీఐపీలు ఆలయానికి విచ్చేయాలని కలెక్టర్ జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సూచించారు. ఇంద్రకీలాద్రిపై ఏర్పాట్లను కలెక్టర్, సీపీ, దుర్గగుడి ఈఓ పర్యవేక్షించారు. మూడు రోజులుగా ఉత్సవాల రద్దీ, వీఐపీల తాకిడిపై చర్చించారు. అమ్మవారిని తొలుత కలెక్టర్ సృజన దర్శించుకున్నారు. అనంతరం మీడియా పాయింట్‌లో కలెక్టర్, సీపీ, దుర్గగుడి ఈఓ మాట్లాడుతూ.. సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనమే తమ ముఖ్య లక్ష్యమన్నారు. ఉదయం ఎనిమిది నుంచి పది, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్యే వీఐపీలు దర్శనానికి రావాలని సూచించారు. ఆ తరువాత వచ్చిన వారిని భక్తులతో కలిపి దర్శనాలకు పంపాలని సిబ్బందికి ఆదేశాలు ఇచ్చామన్నారు.

**పలు పాయింట్లలో టికెట్ల తనిఖీలు**

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి జరిగే ప్రత్యేక అర్జిత సేవలకు తొలి రెండు రోజులు జిరాక్స్ కాపీల బెడద తగిలింది. పలు పాయింట్లలో ఆర్జిత సేవ, వీఐపీ టికెట్లను స్కానింగ్ చేస్తుండటంతో శనివారం ఆ బెడద కాస్తంత తగ్గింది. అమ్మ వారికి విశేషంగా జరిగే ప్రత్యేక లక్ష కుంకుమార్చనకు జిరాక్స్‌లతో పాల్గొంటున్న పలువురు భక్తులను దేవస్థానం గుర్తించింది. వారిపై నిఘా పెట్టడంతో శనివారం ఆయా భక్తులు పూజలకు హాజరుకాలేదు. సమాచార కేంద్రం, లక్ష్మీగణపతి ప్రాంగణంలోనూ వీఐపీ టికెట్లను తనిఖీ చేశారు.



### సోషల్ మీడియాలో మూలవిరాట్

అమ్మవారికి ముంబాయికి చెందిన భక్తులు వజ్ర కిరీటాన్ని కానుకగా సమర్పించగా, దానిని శుక్రవారం అలంకరించారు. శుక్రవారం అమ్మవారి మూలవిరాట్ ఫొటో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. సోషల్ మీడియాలో కనిపించిన అమ్మవారి ఫొటోలో దాతలు ఇచ్చిన వజ్ర కిరీటం ఉండటంతో పోలీసు శాఖ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. శుక్రవారం తెల్లవారుజామున అమ్మవారికి అలంకరణ సమయంలో, నివేదనల సమయంలో అంతరాలయంలో ఎవరెవరు విధులు నిర్వహించారనే అంశంపై ఇంటిలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆరా తీసినట్లు సమాచారం.

### అమ్మవారి నివేదనలు ఇలా..

- తెల్లవారుజాము 3 గంటలకు బాలభోగ నివేదన
- ఉదయం 6 గంటలకు చిత్రాన్నం నివేదన
- 10.30 గంటలకు రాజభోగ నివేదన
- మధ్యాహ్నం 12 గంటలకు పంచభోగ నివేదన
- సాయంత్రం 4 గంటలకు విశేష భోగ నివేదన
- 6.30 గంటలకు మహా నివేదన



దుర్గమ్మకు హారతులు సమర్పిస్తున్న అర్చకులు

### దుర్గగుడిపై నేడు

- తెల్లవారుజామున 3 గంటలకు ఆలయం తెరుస్తారు
- 4 గంటల నుంచి అమ్మవారి దర్శనం ప్రారంభం
- 5 గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన
- ఉదయం 7, 10 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన
- 8 గంటలకు ప్రత్యేక శ్రీచక్ర నవార్చన, ప్రత్యేక చండీ హోమం
- సాయంత్రం 6.30 గంటల నుంచి అమ్మవారికి మహానివేదన, పంచహారతులు, చతుర్వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

# సైబర్ క్రైం..!

సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. వీరి చేతిలో ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యాపారులే మోసపోతుండటం గమనార్హం. నిరక్షరాస్యుల కంటే చదువుకున్న వారే ఎక్కువగా మోసపోతున్నారు. ఇలాంటి వారి నుంచి నేరస్తులు రూ.కోట్లలో దోచుకుంటున్నారు. చాలా మంది ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో విధులు నిర్వర్తిస్తున్నా.. ఇతర ఆదాయాల కోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారు. వీరిని గమనించి సైబర్ నేరగాళ్లు వల వేస్తున్నారు. ఖాతాల్లోని రూ.లక్షలు కొట్టేస్తున్నారు. గత నెల రోజుల కాలంలోనే గుంటూరులో మూడు భారీ సైబర్ నేరాలు చోటుచేసుకున్నాయి. సుమారు రూ.2.5 కోట్ల వరకు సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టారు.

### కష్టార్జితాన్ని పోగొట్టుకుంటున్న బాధితులు

- ఖాతాల్లోని రూ.కోట్లు ఊడ్చేస్తున్న కేటుగాళ్లు
- ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలే లక్ష్యం
- రోజుకో ఎత్తుగడతో మోసగిస్తున్న నేరస్తులు
- అవగాహన లేకుంటే చిల్లిగవ్వ కూడా మిగలదు
- నేరాలకు అడ్డుకట్టపై దృష్టి సారించిన పోలీసులు



**సాక్షి ప్రతినిధి, గుంటూరు:** సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో గుంటూరు పోలీసులు ఈ తరహా నేరాలపై అవగాహన కల్పించేందుకు కార్యాచరణ చేపట్టారు. సైబర్ నేరాలు నియంత్రణ కోసం అసోసియేషన్లతో సమావేశాలు ఏర్పాటు చేశారు. వారికి అవగాహన కల్పిస్తున్నారు. గతంలో ఓటీపీ పేరుతో మోసాలు జరిగేవి. ప్రజల్లో అవగాహన వచ్చి వాటిని ఇతరులకు చెప్పడం లేదు. దీంతో ఆ తరహా నేరాలు తగ్గాయి. ఇప్పుడు లింక్‌లు పంపించడం, వాటిపై క్లిక్ చేస్తే డబ్బులు స్వాహా చేయడం పరిపాటిగా మారింది. విదేశాల నుంచి డ్రగ్స్ తదితర మాదకద్రవ్యాల పార్సిల్ వచ్చిందని, దానిపై పేరు ఉన్నందున కేసు లేకుండా చేయాలంటే డబ్బులు చెల్లించాలని కూడా కేటుగాళ్లు బురిడీ కొట్టిస్తున్నారు. మనీ ల్యాండరింగ్ చేస్తున్నారంటూ మరి కొందర్ని బెదిరించి డబ్బులు కాజేస్తున్నారు.

**వివరాలన్నీ చెప్పి రూ.1.3 కోట్లు కొట్టేసి...**

గుంటూరు నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఒక కేంద్ర ప్రభుత్వ సంస్థ ఉద్యోగికి గత నెల ఆరవ తేదీన ఒక తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో పేరు, జీఎస్టీ శాఖలో విధులు నిర్వర్తిస్తున్నారని అవతలి వ్యక్తి చెప్పాడు. తాను ముంబయి క్రైం బ్రాంచ్ డివిజన్ నుంచి వినోద్‌ఖన్నా అని పేర్కొన్నాడు. నివాసం ఎక్కడో చెప్పేశాడు. మనీ ల్యాండరింగ్‌కు పాల్పడినట్లు ఆరోపించాడు. బ్యాంక్ ఖాతాలో ప్రస్తుతం ఉన్న నగదు వివరాలు కూడా పూసగుచ్చినట్లు పేర్కొని, నమ్మబలికాడు. బాధితుడు అప్పటికీ నమ్మక పోవడంతో వీడియో కాల్ కూడా చేశాడు. అందులో సైబర్ క్రైం డివిజన్ కార్యాలయం, అతని వెనుక భాగంలో పోలీస్ స్టిక్కరింగ్ ఉన్నాయి. దీంతో బాధితుడు భయాందోళనలకు గురయ్యాడు. భయపెట్టి రూ.1.3 కోట్లు నగదు బాధితుడి భార్య ఖాతా నుంచి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తర్వాత అతడికి ఎన్ని మార్లు ఫోన్ చేసినా సమాధానం రాకపోవడంతో మోసపోయినట్లు ఉద్యోగి గ్రహించారు.

### ముంబయి ఎస్‌ఐ అని చెప్పి రూ.10 లక్షలకు టోకరా

మనీ లాండరింగ్ చేస్తున్నారని, ఖాతా ఫ్రీజ్ తప్పదని ముంబయి క్రైం బ్రాంచ్ ఎస్సై పేరిట రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు మరో మోసగాడు. చంద్రమౌళినగర్ ప్రాంతానికి చెందిన పమిడి ముక్కల రామకృష్ణ అనే వ్యక్తికి సెప్టెంబర్ 27వ తేదీన 99584 93579 నెంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. రామకృష్ణ పూర్తి వివరాలు చెప్పాడు. కెనరా బ్యాంక్ ఖాతాలో నుంచి మీరు మనీ లాండరింగ్ చేస్తున్నారని, ఖాతా ఫ్రీజ్ చేశామని నమ్మించాడు. కాసేపు తరువాత ముంబై క్రైం బ్రాంచ్ ఎస్సై అని చెప్పి 70768 57093 నెంబర్ నుంచి బాధితుడికి ఫోన్ వచ్చింది. అరెస్ట్ వారెంట్ జారీ అయిందని భయపెట్టి రామకృష్ణ నుంచి రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఆ తరువాత సదరు ఫోన్ నంబర్ల నుంచి స్పందనే లేదు. దీంతో గురువారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశారు.

### ట్రేడింగ్ పేరిట రూ.1.27 కోట్లకు టోపీ

మరో ఘటనలో ట్రేడింగ్ ఖాతా పేరుతో రూ.1.27 కోట్లు మోసం చేశారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని నలందానగర్ ప్రాంతానికి చెందిన ఓ ఉన్నత విద్యాభ్యాసం చేసిన గృహిణి ఈ ఏడాది ఏప్రిల్ 20వ తేదీన రోజువారీ పనులు పూర్తి చేసుకుని సెల్‌ఫోన్ చూస్తున్నారు. మధ్యాహ్నం సమయంలో ఫేస్‌బుక్ యాప్‌లో ఎంఓయూఎన్‌టీఓ.కమ్ అని ఒక మెసేజ్ వచ్చింది. ఆ మెసేజ్‌ను క్లిక్ చేయగానే ట్రేడింగ్ ఖాతా మేనేజర్ పేరిట ప్రత్యక్షమైన ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ కోసం పెట్టుబడులు పెట్టడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని చెప్పాడు. దీంతో ఆ గృహిణి ట్రేడింగ్ ఖాతా ద్వారా ఆన్‌లైన్‌లో కొంత పెట్టుబడి పెట్టారు. దానికి కొంత లాభం వచ్చినట్లు చూపించారు. అలా విడతలవారీగా పెట్టుబడి పెట్టించి దానికి లాభం ఇస్తుండటంతో నమ్మకం పెరిగింది. ఇలా ఆ మేనేజర్ ఆన్‌లైన్ ద్వారా క్రెడిట్ కార్డు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ద్వారా రూ.1.27 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. తర్వాత నగదు వెనక్కి రాలేదు. అసలు ఆ యాప్ కూడా పనిచేయలేదు. మోసపోయామని ఆమె గుర్తించి గత నెల 25వ తేదీన పోలీసులను ఆశ్రయించారు.




### అందరూ అవగాహన పెంచుకోవాలి

బయట వ్యక్తులు అనుమానాస్పదంగా ఫోన్లు చేసినప్పుడు వారికి డబ్బులు పంపకుండా పోలీసులను ఆశ్రయించాలి. అప్పుడే నేరస్తులు చిక్కడంతోపాటు బాధితుల నగదు భద్రంగా ఉంటుంది. ఇలాంటి నేరాలను నియంత్రించేందుకు బ్యాంక్ అసోసియేషన్లు, పింఛనుదారుల సంఘాలు, ఆటో డ్రైవర్ల అసోసియేషన్లు, ప్రభుత్వ సంఘాల ప్రతినిధులను భాగస్వామ్యం చేయనున్నాం. ఈ మేరకు పోలీసు సిబ్బందికి కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. పెద్ద ఎత్తున సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తాం. ఇలాంటి నేరాలు జరిగిన వెంటనే ఫిర్యాదు చేస్తే సాధ్యమైనంత త్వరగా ఛేదించేందుకు అవకాశం ఉంటుంది. పోగొట్టుకున్న నగదును వేరే ఖాతాలకు మళ్లించకుండా బ్లాక్ చేసే అవకాశం ఉంది. చదువుకున్న వారు కూడా ఆన్‌లైన్ ట్రేడింగ్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది.

– కె. సతీష్‌కుమార్, జిల్లా ఎస్పీ

# జిల్లా వైద్యశాలలో వసతుల కల్పనకు కృషి

**కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్**



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ చంద్రశేఖర్

**తెనాలి అర్బన్:** తెనాలి జిల్లా వైద్యశాలలో నూతన సీటీ స్కాన్ యూనిట్, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్‌లు–2, రక్తం నుంచి ప్లేట్‌లెట్స్‌ను వేరే చేసే యంత్రం, ఆధునిక అంబులెన్స్, మహాప్రస్థాన వాహనం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. తెనాలి జిల్లా వైద్యశాలలో శనివారం జరిగిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విధులలో ఉండే వైద్యులు, సిబ్బంది వివరాలను వార్డులలో ప్రదర్శించాలని ఆదేశించారు. నూతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో సేవా భావం కలిగిన ధనికులను సభ్యులుగా అవకాశం కల్పించాలని సూచించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. వైద్యశాలలో అనేక అంశాలలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్పత్రి భవనం రిపేర్‌లకు త్వరలో రూ.కోటి నిధులను ప్రభుత్వం నుంచి తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నిధులను ఇతర పనులకు ఉపయోగించొద్దని సూచించారు. ఆస్పత్రిలో ఒక్కో విభాగాన్ని దత్తత తీసుకునే దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే ఇద్దరు ముందుకు వచ్చారని తెలిపారు. తెనాలి జిల్లా వైద్యశాల అన్ని అంశాలలో ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రోగులకు మెరుగైన సేవలు అందించటంతోపాటు వారి నుంచి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. వైద్యశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓపీ చూసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముందుగా జిల్లా వైద్యశాలలోని సీటీ స్కాన్ యూనిట్, ఆధునిక ల్యాబ్, పలు వార్డులను పరిశీలించిన మంత్రి తదితరులు అక్కడ అందించే సేవలపై ఆరా తీశారు. సమావేశంలో సబ్ కలెక్టర్ సంజనా సింహ, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మజీదాబేగం, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, సోషల్ వర్కర్ డాక్టర్ సుజాత, ఏపీఎంఎస్ ఐడీసీ ఈఈ రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా వ్యర్థాల నిర్వహణ ముఖ్యం

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య**



ప్లాంట్ వివరాలు తెలుసుకుంటున్న ఛైర్మన్ కృష్ణయ్య, నగర కమిషనర్ శ్రీనివాసులు

**నెహ్రూ నగర్:** వ్యర్థాల నిర్వహణ పటిష్టంగా, ప్రణాళికాబద్ధంగా చేపట్టినప్పుడే పర్యావరణ పరిరక్షణతోపాటు చెత్త సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ పి. కృష్ణయ్య తెలిపారు. శనివారం నాయుడుపేటలోని జిందాల్ అర్బన్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ, వివిధ మునిసిపాలిటీల కమిషనర్లు, ప్రజారోగ్య అధికారులతో కలిసి ఛైర్మన్ పరిశీలించారు. తొలుత జిందాల్ ఏపీ ప్రాజెక్ట్స్ ప్రెసిడెంట్ ఎం.వి.చారి ప్లాంట్ సామర్థ్యం, పనితీరు, అవసరమైన వ్యర్థాలు, ఏయే మున్సిపాలిటీల నుంచి ఎంత చెత్త వస్తుంది, ఎంత విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.. వంటి వివరాలు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం పి. కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రతి నగరపాలక సంస్థ, మునిపాలిటీలో వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్యగా మారిందన్నారు. వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ల ద్వారా నిర్వహణ సులభం కావడంతోపాటు విద్యుత్ వంటి అదనపు వనరులు కూడా సాధ్యం అవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణహిత వ్యర్థాల నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని చెప్పారు. అందుకు తగిన ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు. అనంతరం ప్రాజెక్ట్ పరిసరాల్లో పి.కృష్ణయ్య, ఇతర అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీఎంసీ ఈఈ కొండారెడ్డి, ఏపీపీసీబీ జాయింట్ చీఫ్ ఇంజినీర్ రాజశేఖర్, మునిస్వామి నాయుడు, గుంటూరు ఈఈ నజీనా బేగం, జిందాల్ ప్లాంట్ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

# రూ.77.70 లక్షలు పలికిన చేపల చెరువు

**సంతమాగులూరు (అద్దంకి):** సంతమాగులూరులోని సచివాలయంలో శనివారం నిర్వహించిన 250 ఎకరాల చేపల చెరువు వేలంలో అత్యధిక ధర పలికింది. అధికారులు నిర్వహించిన వేలంలో రూ.77.70 లక్షలు పలికింది. ఏల్చూరుకు చెందిన ఇప్పల వెంకటరెడ్డి చెరువును వేలం పాడి మూడు సంవత్సరాలు 2027 జూన్ వరకు చేపలు పట్టుకునే హక్కును పొందాడు. వేలం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్సై వట్టాభి రామయ్య ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

**వాణిజ్యం**

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **3,300** గరిష్టం : రూ. **5,500**

మోడల్ ధర రూ. **4,800**

## క్లుప్తంగా

### 9న గుంటూరులో పుస్తకాల ఆవిష్కరణ

**తెనాలి:** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పుస్తకాల ఆవిష్కరణ సభను నిర్వహించనున్నారు. అరసం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన వీటిని ఈ నెల 9వ తేదీన ఆవిష్కరించనున్నారు. గుంటూరు బృందావన్ గార్డెన్స్ 5వ లైనులోని గుంటూరు డిస్ట్రిక్ట్ సీనియర్ సిటిజన్ సర్వీస్ ఆర్గనైజేషన్‌లో సాయంత్రం ఆరు గంటలకు కార్యక్రమం ఉంటుంది. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. కథాస్రవంతి పేరుతో తాజాగా తీసుకొచ్చిన 'వాసిరెడ్డి నారాయణ' కథలు, తెనాలికి చెందిన ప్రఖ్యాత రచయిత్రి 'వాసిరెడ్డి సీతాదేవి' మట్టి మనిషి నవల, అవంత్స సోమసుందర్ 'వజ్రాయుధం' పుస్తకాలను ఆవిష్కరిస్తారు. అరసం జాతీయ సమితి అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, గుంటూరు మహిళా కాలేజీ తెలుగు శాఖాధిపతి డాక్టర్ వాసిరెడ్డి భవాని, సాహితీ విమర్శకులు డాక్టర్ పి.సుశీలమ్మ, కవి, విమర్శకుడు కె.శరచ్చంద జ్యోతిశ్రీ, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ పాల్గొంటారు. ఈ మేరకు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రజాభిమానానికి పెన్నిధి నన్నపనేని

**కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని**

**తెనాలి:** రాజకీయాల్లో కొనసాగుతూ తెనాలి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తూనే విద్యా, క్రీడా, సహకార, కళారంగాలు వంటి వాటిల్లో బహుముఖ ప్రతిభతో తనదైన ముద్ర వేసిన మానవతావాది, విశాలాంధ్ర ఉద్యమనేత నన్నపనేని వెంకట్రావు ప్రజాభిమానానికి పెన్నిధిగా అని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖల సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. తెనాలికి చెందిన రాజకీయ ప్రముఖుడు నన్నపనేని వెంకట్రావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఇక్కడి నాజరుపేటలోని ఎన్‌వీఆర్ కన్వెన్షన్ హాలులో ఏర్పాటైన అవార్డుల ప్రదానోత్సవానికి మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. కేంద్ర సహాయ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మూడుసార్లు మున్సిపల్ చైర్మన్‌గా చేసిన నన్నపనేని వెంకట్రావు రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన విద్యాసంస్థను, సహకారరంగంలో జంపని చక్కెర ఫ్యాక్టరీని నెలకొల్పారని చెప్పారు. విశాలాంధ్ర ఉద్యమనేతగానూ గౌరవం పొందారని తెలిపారు. తెనాలికి మాస్టర్ ప్లాన్‌ను ఆయనే రూపొందించారని విన్నానని చెప్పారు.



లంకా సూర్యనారాయణకు అవార్డు ప్రదానం చేస్తున్న చంద్రశేఖర్, మనోహర్

ఆయన లెగసీని కొనసాగిస్తూ స్ఫూర్తిదాయకమైన సేవలను అందిస్తున్న కుటుంబసభ్యులను అభినందించారు. రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. గతంలో అయితానగర్–చినరావూరు రోడ్డు, పట్టణం, గ్రామాల్లోని పలు వంతెనలను వెంకట్రావు నిర్మించారని చెప్పారు. అవార్డు గ్రహీతల్లో ఒకరైన అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ స్ఫూర్తిగా వాటిని విజ్ఞాన కేంద్రాలుగా మలుచుకుందామని తెలిపారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ నన్నపనేనితో తన అనుబంధాన్ని స్మరించుకున్నారు.



డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

తొలుత గుంటూరుకు చెందిన అన్నమయ్య గ్రంథాలయం వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణను, పేదల డాక్టర్‌గా గుర్తింపును పొందిన డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి నన్నపనేని అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. అవార్డుగ్రహీతలు వారి వారి రంగాల్లో చేసిన కృషిని అతిథులు అభినందించారు. అంతకుముందు ట్రస్ట్ వ్యవస్థాపకుడు నన్నపనేని సుధాకర్ మాట్లాడుతూ.. నన్నపనేని వెంకట్రావు సేవలు, ట్రస్ట్ కార్యక్రమాలను వివరించారు. నన్నపనేని భాగ్యలక్ష్మి, భాస్కర్, సుగుణ, యడ్లపల్లి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

## ఇసుక క్వారీల నిర్వహణకు పరిశీలన

**కొల్లూరు:** కృష్ణా నదిలో ఇసుక క్వారీల నిర్వహణకు ఉన్న అవకాశాలను బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. శనివారం ఆయన మండలంలోని గాజుల్లంక, జువ్వలపాలెం కృష్ణా నదిలో గతంలో ఇసుక తవ్వకాలకు నిర్దేశించిన రీచ్‌లలో ఇప్పటి పరిస్థితిని తనిఖీ చేశారు. తొలుత గాజుల్లంక వద్దకు చేరుకున్నారు. క్వారీకి కేటాయించిన ప్రదేశానికి వరద నీరు కారణంగా ప్రస్తుతం వెళ్లే అవకాశం లేక మ్యాప్‌ల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. జువ్వలపాలెం ప్రాంతాన్ని కూడా దూరం నుంచే పరిశీలించారు. ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు అవకాశం లేని పరిస్థితుల్లో డ్రోన్ల సాయంతో సర్వే చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట జేసీ ప్రఖర్ జైన్, మైనింగ్, రెవెన్యూ, ఆర్‌సీ అధికారులు ఉన్నారు.



జువ్వలపాలెంలో పరిశీలిస్తున్న కలెక్టర్ జె. వెంకట మురళి, జేసీ ప్రఖర్ జైన్

### పట్టభద్రుల ఓట్ల నమోదుకు ఎన్జీవో హోంలో ఫెసిలిటేషన్ సెంటర్

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఓటర్ల నమోదుకు ఏపీ ఎన్జీవో హోంలో ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో శనివారం ఎన్జీజీవో కార్యవర్గ సభ్యులు, ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులే కాకుండా వారి కుటుంబ సభ్యుల్లో కూడా పట్టభద్రులు ఉన్నారని, వారంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. దీనికి ఏపీ ఎన్జీవో హోంలో ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.సత్యనారాయణ రెడ్డి, జిల్లా నేతలు పి. రమేష్, సతీష్, రాజబాబు, బీవీ రమణ, ఇ.విశ్వనాథ్, బి. నాగార్జున పాల్గొన్నారు.

### పంచాయతీ పరిపాలనపై ముగిసిన శిక్షణ

**గుంటూరు ఎడ్యుకేషన్:** గ్రామ పంచాయతీల్లో పరిపాలనా వ్యవస్థపై ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ఎంపీడీఓలు, ఈఓపీఆర్డీలకు జెడ్పీ సమావేశ మందిరంలో మూడు బ్యాచ్‌లుగా కొనసాగిన శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా రీసోర్స్ పర్సన్ పి.నాగానంత్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆస్తులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత గ్రామ సర్పంచ్‌తో పాటు కార్యదర్శిదే అని అన్నారు. మరొక రీసోర్స్ పర్సన్ బొంతా సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో డీటీఎం కె.నాగేశ్వరరావు, డీసీ పి.పద్మారాణి, ఎస్‌ఆర్డీ పరిశీలకులు మోహనరావు, డీపీఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వర్ణకార సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా మహేష్

**మంగళగిరి:** గుంటూరు జిల్లా స్వర్ణకార సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన పారేపల్లి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ఈ మేరకు ప్రకటించారు. సభ్యులుగా ధనాల కోట శ్రీనివాసరావు, పంచుమర్తి శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కణితి శ్రీనివాసరావు, అధికార ప్రతినిధిగా పి.సాయికిరణ్‌లను ప్రకటించారు. మహేష్ మాట్లాడుతూ స్వర్ణకార కార్పొరేషన్‌ను సర్కారు ఏర్పాటు చేయాలన్నారు. సంఘం ప్రతినిధి కొల్లి లక్ష్మీ గిరిధరరావు పాల్గొన్నారు.



మహేష్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

## వృద్ధురాలిపై దాడి చేసి బంగారం దోపిడీ

**పట్నంబజారు:** వృద్ధురాలిపై దాడి చేసి బంగారం దోచుకుపోయిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చౌత్రా సెంటర్‌లో ఐనవోలు రవీంద్ర (70) ఒంటరిగా ఉంటున్నారు. శనివారం గుర్తుతెలియని ఓ వ్యక్తి వచ్చి తలుపు కొట్టడంతో వృద్ధురాలు తలుపు తీశారు. ఆమెపై దాడి చేసి మెడలోని గొలుసు, గాజులు లాక్కొని అతడు పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 60 గ్రాముల బంగారం చోరీ అయినట్లు బాధితురాలు చెప్పారు.

# మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సులు

**తాడికొండ:** మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించడంతోపాటు భద్రత పెంచడమే లక్ష్యంగా నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, నేషనల్ కమీషన్ ఫర్ ఉమెన్ సౌజన్యంతో జిల్లా వ్యాప్తంగా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, ప్రిన్సిపల్ జిల్లా జడ్జి పార్థసారథి అన్నారు. తుళ్ళూరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. న్యాయమూర్తిగా బెంచ్‌పై నుంచి చూస్తే ప్రజలు చాలామంది తమకు చట్టాల గురించి తెలియదని చెబుతున్నారని పేర్కొన్నారు. సహజ న్యాయ సూత్రాలను ఆధారం చేసుకునే చట్టాలు ఏర్పడ్డాయన్నారు. చట్టాలు లేని రోజుల్లోనే న్యాయ వ్యవస్థ ఉందని గుర్తుచేశారు. చదువు లేకుండానే ఏది న్యాయం, ఏది అన్యాయం అనేది అప్పుడే తెలుసని పేర్కొన్నారు. కూలీ నాలీ చేసుకునే వారు అధికంగా మోసపోతున్నారని, వారికి న్యాయం చేయాలంటే చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా మరో 10 సంవత్సరాల్లో మరింత మిన్నగా సమాజం మారుతుందన్నారు. స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ భవిత, మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ మంగళగిరి నాగరాజు, రీసోర్స్‌పర్సన్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి పార్థసారథి

# చేతి వృత్తిదారుల హక్కులు కాపాడాలి

**లక్ష్మీపురం:** కార్పొరేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తూ కేంద్ర, రాష్ట్ర పాలకులే చేతివృత్తిదారుల జీవితాలను ఛిద్రం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు విమర్శించారు. గుంటూరు నగరంలోని మల్లయ్య లింగం భవన్‌లో చేతి వృత్తిదారుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సమావేశం శనివారం జరిగింది. సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సి. లింగమయ్య అధ్యక్షత వహించారు. ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయ, చేనేత రంగాలు పాలకుల పుణ్యమా అని కార్పొరేట్ చేతుల్లో వెళ్లాయన్నారు. చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ నినాదాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం చేతివృత్తిదారులను ఆదుకునేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ.. చంద్రబాబు ప్రభుత్వం విశాఖ ఉక్కు వంటి పరిశ్రమలు ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకోవాలన్నారు. సమావేశంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగాంజనేయులు, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు కడవు కన్నయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొట్టుముక్కల బాలాజీ, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట్ల పోతులయ్య, రజక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు బుద్ధారపు వెంకటరావు, చేతి వృత్తిదారుల సమాఖ్య నాయకులు ఎం.కారన్న, రాజశేఖర్ (కర్నూలు), ఎం.రామ్మోహన్, నాగేంద్ర (నంద్యాల), నరసింహులు (సత్యసాయి), మల్లు సీతారాం ప్రసాద్ (పశ్చిమగోదావరి), సింహాద్రి దుర్గారావు (మన్యం పార్వతీపురం) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

# విద్యార్థినులు క్రీడల్లోనూ రాణించాలి

**గుంటూరు ఎడ్యుకేషన్:** విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్పోర్ట్స్– గేమ్స్ మీట్‌లో భాగంగా శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో విద్యార్థినులకు ఆటల పోటీలు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసులు మాట్లాడుతూ.. మహిళా శక్తి అపారమైనదని, అన్ని రంగాల్లో వారు రాణిస్తున్నారని పేర్కొన్నారు. విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్, డీన్లు కిషోర్, చంద్రశేఖర్, సురేష్, సాయి ఆదిత్య స్కూల్ డైరెక్టర్లు రవీంద్రబాబు, రామ్మోహనరావు, జోనల్ ప్రిన్సిపల్ శాంతకుమారి, విజయ రామారావు పాల్గొన్నారు.



విద్యార్థినుల నుంచి క్రీడాజ్యోతి అందుకున్న కమిషనర్ శ్రీనివాసులు, దుర్గాప్రసాద్

### సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

**నగరంపాలెం:** జిల్లాలోని ప్రజలు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లోని శనివారం సైబర్ నేరాలను పర్యవేక్షించే పోలీస్ సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ మోసాలు జరిగితే టోల్‌ఫ్రీ నెంబర్ 1930లో సంప్రదించాలని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. టీఏడబ్ల్యూ (సోషల్ మీడియా అండ్ సైబర్ సెల్) ఇన్‌ఛార్జ్ సీఐ నాగమల్లేశ్వరరావు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు కానిస్టేబుళ్లకు కూడా కోర్టు మానిటరింగ్ పద్ధతిపై సమావేశం నిర్వహించారు. సిస్టం ఎస్ఐ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## తెనాలి డబుల్‌హార్స్ బ్రాండ్ తొలి ఔట్‌లెట్ ప్రారంభం

**తెనాలి:** ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలో పేరొందిన తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ తన తొలి బ్రాండ్ ఔట్‌లెట్‌ను శనివారం నందివెలుగు–కొల్లిపర రోడ్డులోని మహదేవ దాల్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రారంభించింది. గ్రూప్ డైరెక్టర్ మునగాల లక్ష్మీశైలజ దీనిని ప్రారంభించాక మాట్లాడుతూ.. తమ అభివృద్ధి ప్రయాణంలో ఇదొక మైలురాయిగా వెల్లడించారు. ఔట్‌లెట్‌లో డబుల్‌హార్స్ సంస్థ పూర్తి ఉత్పత్తులను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఇంటికి నాణ్యమైన ఉత్పత్తులను తీసుకురావాలనే తమ నిబద్ధతకు ఇదొక నిదర్శనమన్నారు. పెరుగుతున్న గ్లోబల్ వినియోగదారులకు సేవలందిస్తూనే, దేశీయ మార్కెట్‌లో బలోపేతమే లక్ష్యంగా సాగుతున్నట్టు తెలిపారు. ఖాతాదారులు, శ్రేయోభిలాషులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. డబుల్‌హార్స్ గ్రూప్ చైర్మన్ మునగాల వెంకట శ్యామ్‌ప్రసాద్, జనరల్ మేనేజర్ పీఎస్‌వీ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ఔట్‌లెట్‌లో డైరెక్టర్ లక్ష్మీశైలజ, చైర్మన్ మునగాల శ్యామ్‌ప్రసాద్ తదితరులు

## జీజీహెచ్ పరిసరాల్లో దుకాణాలు తొలగింపు

- తొలుత అడ్డుకున్న యజమానులు
- పోలీసు బందోబస్తుతో తొలగింపు
- నిరసన తెలిపిన చిరు వ్యాపారులు

**నెహ్రూనగర్:** గుంటూరు గవర్నమెంట్ హాస్పిటల్ (జీజీహెచ్) పరిసరాల్లోని దుకాణాలను నగరపాలక సంస్థ అధికారులు పోలీసుల సహకారంతో శనివారం ఉదయం తొలగించారు. కొన్ని సంవత్సరాలుగా జీజీహెచ్ ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి కొంత మంది చిరువ్యాపారులు చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఆ దుకాణాల వల్ల జీజీహెచ్‌లోకి ఎలుకల బెడద ఎక్కువ కావడంతోపాటు రాత్రి వేళల్లో అక్కడ మాదక ద్రవ్యాల విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దీనిపై నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులుకు ఫిర్యాదు చేశారు. శనివారం నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు జేసీబీల సహాయంతో సదరు షాపులను తొలగించేందుకు ఉదయం 9 గంటలకు అక్కడికి చేరుకున్నారు. 11 గంటల వరకు వ్యాపారులు అడ్డుకున్నారు. ఆ తరువాత జేసీబీల సహాయంతో సదరు దుకాణాలను తొలగించారు. దీంతో వ్యాపారులు రోడ్డుపై బైటాయించారు. తమ పొట్ట కొట్టవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు. కొంత సేపు ట్రాఫిక్ జాం అయింది. ట్రాఫిక్ పోలీసులు, కొత్తపేట పోలీసులు వచ్చి వ్యాపారులతో మాట్లాడి ట్రాఫిక్ క్లియరెన్స్ చేశారు.



జేసీబీ సాయంతో దుకాణాన్ని తొలగిస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది



రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు

## పోస్టుమార్టానికి మృతదేహం తరలింపు

**తాడేపల్లి రూరల్:** తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెనుమాక గ్రామానికి చెందిన చిట్టిబోతుల శివమల్లేశ్వరరావు మృతి చెందడంతో ఆయన మూడవ భార్య మేడ్చర్ల నాగమల్లేశ్వరి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు పోలీసులు ఆమె ఫిర్యాదు స్వీకరించి శనివారం తెల్లవారుజామున శివమల్లేశ్వరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. శివమల్లేశ్వరరావు మొదటి భార్యకు ఇద్దరు పిల్లలు పుట్టిన అనంతరం అనారోగ్యంతో మృతి చెందింది. అనంతరం పొన్నూరుకు చెందిన లీలావతిని రెండవ వివాహం చేసుకున్నాడు. ఈ విషయం దాచిపెట్టి విజయవాడకు చెందిన నాగమల్లేశ్వరిని 2019లో పెళ్లి చేసుకున్నాడు. లీలావతి దీనిపై పోలీసులను ఆశ్రయించారు. శివమల్లేశ్వరరావు, నాగమల్లేశ్వరి సహా మరో ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం మొదటి భార్య పిల్లలతో కలిసి రెండవ భార్య లీలావతి.. శివమల్లేశ్వరావును చంపేందుకు ప్రయత్నిస్తోందని నాగమల్లేశ్వరి పోలీసులను ఆశ్రయించినా ఎక్కడా కేసు నమోదు కాలేదు. ఈ నెల మూడవ తేదీ గురువారం తెల్లవారుజామున పెనుమాకలోని లీలావతి ఇంట్లో మృతి చెందాడు. తాడేపల్లి పోలీసులను నాగమల్లేశ్వరి ఆశ్రయించారు. మొదట కేసు నమోదుకు నిరాకరించారు.